సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 52.843 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం నాటికి 52.843 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 480 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.91,570
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,310
3శాతం జీఎస్టీతో	రూ.8,559
నవర (8గ్రా)	రూ.68,472

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.7 /27.1

జిల్లాలో వాతావరణం ఆదివారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 54 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

184 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



గోకులకృష్ణ రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

జలదంకి: మండలంలోని ఎల్‌ఆర్‌అగ్రహారం రోడ్డులో ఉన్న గోకులకృష్ణ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన దాదాపు 184 క్వింటాళ్ల రేషన్ బియ్యం సివిల్ సప్లయీస్ అధికారుల తనిఖీల్లో పట్టుబడ్డాయి. రైస్‌మిల్లులో రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారంతో శనివారం కావలి సివిల్ సప్లయీస్ ఏఎస్‌ఓ రవి, జలదంకి డీటీ జూలీబాయ్, జలదంకి, గోపన్నపాళెం వీఆర్వోలు గిరిధర్ రెడ్డి, మాలకొండయ్య రైస్‌మిల్లును తనిఖీ చేశారు. 184.25 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి మార్కెట్ విలువ రూ.6,60,962గా గుర్తించారు. మిల్లు యజమాని నిమ్మకాయల వెంకటేశ్వర్లుపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఓ రవి తెలిపారు. ఈ బియ్యాన్ని కావలిలోని ప్రభుత్వ గోడౌన్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎంఈఓ సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

ఉలవపాడు: విధి నిర్వహణలో మద్యం తాగుతూ.. ఆ మత్తులో ఉంటున్న ఉలవపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఇన్‌చార్జి ఎంఈఓ కల్లూరి శివనాగేశ్వరరావును ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి విధుల నుంచి సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హైస్కూల్ ఆట స్థలంలో మద్యం మత్తులో తూగుతున్న ఎంఈఓపై సాక్షిలో 'ఆయన మారలేదు' శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ఆనంద్ విద్యాశాఖను నివేదిక కోరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంఈఓ సస్పెన్షన్ ఉత్తర్వులు నోటీస్ బోర్డులో ఉంచాలని డీఈఓ, డిప్యూటీ డీఈఓతో పాటు ఎంఈఓ-2 రమణయ్యను ఆదేశించారు.

జింకను వేటాడిన వ్యక్తిపై కేసు నమోదు



నిందితుడిని అదుపులోకి తీసుకున్న డీఎఫ్‌ఓ మహబూబ్‌బాషా, రేంజర్ మాల్యాద్రి

నెల్లూరు (అర్బన్): ఆమంచర్ల సెక్షన్ కసుమూరు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో జింకను వేటాడిన ఓ వ్యక్తిని ఫారెస్ట్ అధికారులు శనివారం మాంసంతో సహా పట్టుకుని అరెస్ట్ చేశారు. వెంకటాచలం మండలం వెంకటకృష్ణాపురం (వడ్డిపాళెం)కు చెందిన చల్లా కృష్ణయ్య అడవిలో జింకను వేటాడి మాంసాన్ని బాక్స్‌లో పెట్టుకుని వెళుతున్నట్లు సమాచారం అందుకున్న నెల్లూరు ఫారెస్ట్ రేంజర్ మాల్యాద్రి, సిబ్బంది తనిఖీ చేసి పట్టుకున్నారు. నిందితుడిని వేదాయపాళెంలోని జిల్లా అటవీ శాఖాధికారి కార్యాలయానికి తీసుకు వచ్చారు. పరిశీలించిన డీఎఫ్‌ఓ మహబూబ్‌బాషా మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం కృష్ణయ్యపై కేసు నమోదు చేశామని తెలిపారు.

'రంగడి' సన్నిధిలో నేడు సీతారాముల కల్యాణం

నెల్లూరు (బృందావనం): రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు సీతారాముల కల్యాణం జరుగుతుందని ఈఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. 8.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి, సీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీరామచంద్రస్వామి వారికి తిరుమంజనం, 10.30 గంటలకు శ్రీరామ అవతార ఘట్ట పురాణ పఠనం, సాయంత్రం 6.30 గంటలకు తల్పగిరి రంగనాథస్వామి వారికి హనుమంత సేవ పేట ఉత్సవం జరగనున్నాయని తెలిపారు.

కప్పం కట్టు.. లోడెత్తు

పెన్నాను తోడేస్తున్న పచ్చ తోడేళ్లు

- వెంకటగిరిలో ప్రజాప్రతినిధి అండతో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా
- రాజుపాళెం, తెలుగురాయపురంలో అక్రమ రీచ్‌లు
- నిత్యం 3,200 మెట్రిక్ టన్నుల ఇసుక ఇతర రాష్ట్రాలకు..
- పెన్నానదిలోకి నేరుగా రాచబాటలు వేసిన ఇసుకాసురులు
- పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నా పట్టించుకోని అధికారులు



తెలుగురాయపురం రీచ్‌లో యంత్రాలతో ఇసుక లోడింగ్



రాజుపాళెం రీచ్‌లో యథేచ్ఛగా ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

పెన్నానదిలో ఇసుక రేవుల్లో పచ్చ దొంగలు పడ్డారు. ప్రభుత్వ, పర్యావరణ అనుమతులు లేకుండానే నదిలో అక్రమంగా ఇసుక తవ్వేసి జేబులు నింపుకొంటున్నారు. పచ్చ నేతల దోపిడీకి అధికార యంత్రాంగం సాగిలపడుతోంది. నిబంధనలను బేఖాతరు చేస్తూ రేయింబవళ్లు లారీలు, టిప్పర్లు వరుసపెట్టి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా.. అధికార యంత్రాంగం సైతం అవినీతిలో భాగస్వాములై అసలు ఇసుక రవాణే జరగడం లేదంటూ నిస్సిగ్గుగా బుకాయిస్తోంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వెంకటగిరి నియోజకవర్గంలో ఇసుక తోడేళ్లు రెచ్చిపోతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి అండతో షాడో ఎమ్మెల్యే కనుసన్నల్లో పచ్చ మాఫియా అధికారంలోకి వచ్చిన పది నెలల్లో కోట్లకు పడగలెత్తారంటే.. ఏ స్థాయిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందో అర్థమవుతోంది. కలువాయి మండలం రాజుపాళెం, తెలుగురాయపురం సమీపంలోని పెన్నానదిని పచ్చ నేతలు కుళ్లబొడిచేస్తున్నారు. వాస్తవానికి పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు ప్రధానంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి ఉండాలి. కానీ ఇక్కడ ఇసుక తవ్వకాలకు ఎన్‌జీటీ అనుమతి ఇవ్వలేదు. పది నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తమ్ముళ్లు ఇసుక రేవుల్లో పడి దోచేస్తున్నారు.

యూనిట్‌కు రూ.వెయ్యి వాటా

రాజుపాళెం, తెలుగురాయపురం ఇసుక రేవుల నుంచి ఇసుక తరలించాలంటే నియోజకవర్గ ప్రజాప్రతినిధికి యూనిట్‌కు రూ.వెయ్యి వాటా ముట్టజెప్పాల్సి ఉంది. ఆ ప్రజాప్రతినిధి తెలుగురాయపురం, అనంతసాగరం మండలానికి చెందిన వారికి రాజుపాళెంలో రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చేశాడు. షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న నాయకుడి కనుసన్నల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి నిత్యం సగటున వంద వాహనాల్లో ఇసుక తరలిపోతున్నట్లు సమాచారం. ప్రతి వాహనానికి 8 యూనిట్లు లెక్కన నిత్యం 800 యూనిట్ల ఇసుకను ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. ప్రజాప్రతినిధి అండతో ఇసుక మాఫియా బరితెగించి రేయింబవళ్లు తవ్వకాలు చేస్తోంది. పగలు, రాత్రి వాహనాల రణగొణ ధ్వనులతో ఆయా మార్గంలోని నివాసాల్లో ఉంటున్న వారికి నిద్ర, ప్రశాంతత కరువైంది. ఇళ్లు, రోడ్లు దుమ్ముకొట్టుకుపోతున్నాయి. రహదారులు సైతం ఛిద్రమవుతున్నాయి. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఈ అక్రమార్జనలో భాగస్వాములయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నదిలోకి రాచబాట

పర్యావరణానికి తూట్లు పొడుస్తూ పెన్నానదిలోకి రాచబాట వేశారు. తెలుగురాయపురానికి ప్రధాన రహదారి నుంచి నది మధ్యలోకి రోడ్డు వేశారు. రాజుపాళెంలోకి ప్రధాన రహదారి నుంచి ప్రైవేట్ వ్యక్తికి చెందిన మామిడి తోట నుంచి రోడ్డును నిర్మించారు. ఆ రహదారి వేసినందుకు ప్రైవేట్ వ్యక్తికి నెలకు రూ.50 వేలు ఇస్తున్నారు. నదీ గర్భంలోకి రోడ్డు వేసినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల పత్రికల్లో కథనాలు రావడంతో రహదారిని మూసివేసినట్లుగా హడావుడిగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్నట్లు ఫొటోలు తీసి ప్రచారం చేశారు. గంటల వ్యవధిలోనే ఆ ఫ్లెక్సీలు చించేసి యథావిధిగా రహదారి నుంచి వాహనాల రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టారు. అధికార పార్టీ నేతల సహకారంతో ఇసుక మాఫియా నదీలో ఇసుక దోపిడీ చేస్తుంటే అధికారులు మాత్రం కళ్లకు గంతలు కట్టుకుని ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై కలువాయి తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌ను సాక్షి ప్రశ్నించగా పెన్నానదిలో ఇసుక అక్రమ రవాణా విషయం మాకు తెలియదు. ఇసుక రవాణా జరుగుతుంటే మీరే మైనింగ్ శాఖకు ఫిర్యాదు చేయండి అంటూ ఉచిత సలహా ఇచ్చారు.



రాజుపాళెం రీచ్‌లోకి వెళ్లే రోడ్డును మూసివేసినట్లుగా డూప్ ఫ్లెక్సీ షో

రైల్లో దోపిడీ ఘటనలో ఆరుగురు దుండగులు

- ముగ్గురిని గుర్తించాం, త్వరలో కేసును ఛేదిస్తాం
- రైల్వే ఎస్పీ రాహుల్‌మీనా



మాట్లాడుతున్న రైల్వే ఎస్పీ రాహుల్ మీనా

నెల్లూరు సిటీ: జిల్లాలోని అల్లూరు రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలో జరిగిన రైల్లో జరిగిన దోపిడీ ఘటనలో ఆరుగురు దుండగులు పాల్గొన్నారని, వారిలో ముగ్గురు నిందితులను గుర్తించినట్లు రైల్వే ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. ఇటీవల రైల్లో దోపిడీ జరిగిన ప్రాంతాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం నగరంలోని రైల్వే డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దుండగులు సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి దొంగతనం చేశారన్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా ముగ్గురు నిందితులను గుర్తించినట్లు తెలిపారు. ఈ ముగ్గురు విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిలో ఒకరిని ప్రయాణికుడు ధ్రువీకరించారన్నారు. రైలులో రాజస్థాన్, ఢిల్లీ, హరియాణాకు చెందిన ప్రయాణికులు ఉన్నారని, వారిని కూడా విచారిస్తున్నామన్నారు. దొంగతనం జరిగిన తీరును బట్టి నిందితులు ఆరుగురు ఉన్నట్లు అంచనా వేస్తున్నామన్నారు. కొందరు ట్రాక్‌పై ఉండి, రైల్లో రెండు చైన్ స్నాచింగ్, రెండు బ్యాగు దొంగతనాలు జరిగాయన్నారు. కేసును వీలైనంత త్వరగా పరిష్కరించాలని డీజీపీ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇప్పటికే నెల్లూరు జీఆర్పీ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా ఇదే తరహాలో నేరాలు జరిగాయని, వాటిని కూడా పరిశీలిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రైల్వే డీఎస్పీ మురళీధర్ పాల్గొన్నారు.

దోపిడీ ఘటనలో దర్యాప్తు ముమ్మరం

- ఘటనా స్థలాలను పరిశీలించిన రైల్వే ఎస్పీ
- సాంకేతిక, ఇతర సమాచారం ఆధారంగా దర్యాప్తు

బిట్రగుంట: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని అల్లూరురోడ్డు-పడుగుపాడు స్టేషన్ల మధ్య సిగ్నల్ ట్యాంపర్ చేసి రైల్లో దోపిడీకి పాల్పడిన ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అల్లూరురోడ్డు, పడుగుపాడు స్టేషన్ల సమీపంలో హోమ్ సిగ్నల్ ట్యాంపర్ జరిగిన ప్రాంతాలను గుంతకల్ జీఆర్పీ ఎస్పీ రాహుల్‌మీనా శనివారం పరిశీలించారు. సుమారు 2 గంటలకు పైగా ఘటనా స్థలాల్లోనే ఉండి అన్ని వివరాలు సేకరించారు. తొలుత అల్లూరురోడ్డు సమీపంలో గ్లూడ్ జాయింట్ వద్ద నాణెం ద్వారా సిగ్నల్ ట్యాంపర్ చేయడం, ట్రాక్ లీడ్ జంక్షన్ బాక్స్‌లతో వైర్లు కట్ చేసి సిగ్నల్స్‌ని ట్యాంపర్ చేసిన ప్రాంతాలను, అనంతరం పడుగుపాడు వద్ద కూడా సిగ్నల్స్ ట్యాంపర్ చేసిన ప్రాంతాలను పరిశీలించారు. సాంకేతిక నిపుణుల సహకారంతో దర్యాప్తునకు అవసరమైన కీలక సమాచారం సేకరించారు. స్టేషన్ ఔటర్లో చేపట్టిన నిఘా చర్యలు, సిగ్నల్ ట్యాంపర్ చేసే ముఠాల ఆగడాలకు అడ్డుకట్ట వేసే విషయంలో సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ వెంట రైల్వే డీఎస్పీ, సీఐలు, సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళుర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో సామాజిక న్యాయం కోసం పోరాడి బడుగు బలహీన వర్గాల ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన గొప్ప సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్ అని అన్నారు. జిల్లాలో 30 శాతం ఎస్సీ, ఎస్టీల జనాభా ఉందని, వీరి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ మహనీయుల చరిత్ర తెలుసుకోవడంతోపాటు వారి స్ఫూర్తితో చరిత్రలో తమకు ఒక ప్రత్యేక స్థానం సాధించాలనే పట్టుదల, కార్యదక్షత విద్యార్థులు అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కేవలం చదువు, ఉద్యోగాలు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరూ సమాజహితం కోసం పనిచేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం గురించి గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని పలు సంఘాల నాయకులను కోరారు. ఈ చట్టం ఎటువంటి రక్షణ కల్పిస్తుందో వివరించాలన్నారు. తొలుత పలు సంఘాల నాయకులు బాబూ జగ్జీవన్‌రామ్ జీవిత విశేషాలు, రాజకీయంగా ఆయన ఎదిగిన తీరు, దేశానికి బడుగు బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ఉదభాస్కర్‌రావు, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, విద్యార్థినిలు, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ఆనంద్

మా బిడ్డ బతికే ఉందో లేదో చెప్పండి సారూ

- 40 రోజుల క్రితం మిస్సింగ్ అయిన యువతి తల్లి ఆందోళన
- డీఎస్పీ కార్యాలయం ఎదుట మహిళల నిరసన

ఆత్మకూరు: మా బిడ్డ 40 రోజుల క్రితం అదృశ్యమైందని, అనుమానం ఉండే యువకుడి వివరాలు తెలుపుతూ ఏఎస్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తమ బిడ్డ బతికి ఉందో, లేదో చెప్పండంటూ ఆ యువతి తల్లి డీఎస్పీ కార్యాలయం ఎదుట విలపించింది. తన బిడ్డ ఆచూకీ తెలపాలంటూ ఆ తల్లి న్యాయవాది నందా ఓబులేసు, అలీ, పలువురు మహిళలతో కలిసి ఆత్మకూరు డీఎస్పీ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన వ్యక్తం చేసింది. బాధితుల కథనం మేరకు.. ఏఎస్‌పేట మండలం రాజవోలుకు చెందిన హబీబున్నీసా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె కుమార్తె (20) ఆత్మకూరులోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. కళాశాలలో పరిచయమైన ఇందుకూరుపేట మండలం జేజేపేటకు చెందిన చేవూరు భరణీధర్ మాయమాటలు చెప్పి ఫిబ్రవరి 26న తీసుకెళ్లిపోయాడు. మరుసటి రోజు ఏఎస్‌పేట ఎస్సై సైదులుకు ఫిర్యాదు చేసి వారం రోజుల పాటు స్టేషన్ చుట్టూ తిరగ్గా భరణీధర్ తల్లిని స్టేషన్‌కు పిలిపించారు. ఆమెను విచారణ చేస్తే ఆమె పోలీసులకే ఎదురు సమాధానం చెప్పిందని బాధితులు తెలిపారు. దీంతో అప్పటి నుంచి స్టేషన్ చుట్టూనే తిరుగుతున్నా పూర్తి స్థాయి విచారణ చేయకపోవడంతో తమ కుమార్తె ప్రాణాలతో ఉందో, లేదో అనే అనుమానం వ్యక్తం అవుతుందని యువతి తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. భరణీధర్ ఇప్పటికే కళాశాలలో మురగళ్ల, రాయచోటి, ఆత్మకూరుకు చెందిన ముగ్గురు బాలికలను మోసం చేశాడనే విషయాలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. ఇటీవల ఎస్సైని మరోసారి కలిసి విన్నవించుకోగా ఆయన విసుక్కున్నారని, మీరే వెతుక్కోవాలని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పలువురు మహిళలతో కలిసి ఆత్మకూరు డీఎస్పీని కలిసేందుకు వచ్చినట్లు వారు తెలిపారు. అమ్మాయిలు మిస్సింగ్ అవుతున్నారని గతంలో పవన్ కల్యాణ్, చంద్రబాబు విమర్శలు చేశారని, ప్రస్తుతం ఏఎస్‌పేట, మర్రిపాడు, అనంతసాగరం పోలీసు స్టేషన్ల పరిధిలోనే ముగ్గురు అదృశ్యమై రోజులు గడుస్తున్నా.. ఈ ప్రభుత్వంలో ఎలాంటి చర్యలు లేవని మహిళలు మండిపడ్డారు. డీఎస్పీ అందుబాటులో లేకపోవడంతో ఆత్మకూరు సీఐ జి గంగాధర్, ఎస్సై ఎస్‌కే జిలానీ అక్కడకు చేరుకుని బాధిత మహిళలతో మాట్లాడారు. ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి ఎక్కడున్నా తీసుకు వస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. అదే సమయంలో సీఐ ఆదేశాల మేరకు ఆత్మకూరుకు వచ్చిన ఏఎస్‌పేట ఎస్సై సైదులును మహిళలు చుట్టుముట్టారు. ఆ సమయంలో మర్రిపాడు మండలం బాట గ్రామానికి చెందిన గంగిశెట్టి శ్రీనివాసులు కుమార్తె (16)ను మాయమాటలు చెప్పి ఓ వ్యక్తి తీసుకెళ్లాడని ఆ గ్రామస్తులు వచ్చి సీఐకి ఫిర్యాదు చేయడం గమనార్హం.



ఆత్మకూరు డీఎస్పీ కార్యాలయంలో మహిళలు, గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ గంగాధర్, పోలీసులు

చంద్రబాబు చరిత్రహీనుడు

- వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు ముస్లిం సమాజం వ్యతిరేకం
- మాజీ డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): దేశ వ్యాప్తంగా ముస్లిం సమాజం వ్యతిరేకిస్తున్న వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు మద్దతు పలికి చంద్రబాబు చరిత్రహీనుడిగా మిగిలిపోయారని మాజీ డిప్యూటీ మేయర్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్ అన్నారు. నెల్లూరులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ విరుద్ధమైన బిల్లును ఆమోదం తెలిపేందుకు చంద్రబాబు పూర్తి సహకారాన్ని అందించి ముస్లింల పట్ల తన వ్యతిరేక వైఖరిని చాటుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ భూములను కాజేసే కుట్రలో తెలుగుదేశం పార్టీ భాగస్వామిగా మారిందని ధ్వజమెత్తారు. టీడీపీ, జనసేనకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

- వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ హంజా హుస్సేనీ మాట్లాడుతూ ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా లోక్‌సభ, రాజ్యసభలో వక్ఫ్ చట్ట బిల్లును ప్రవేశపెట్టారన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేనలు మతతత్వ పార్టీలుగా తమ వైఖరిని బహిర్గతం చేశాయన్నారు. వక్ఫ్ భూములు అన్యాక్రాంతం చేయడం కోసం నల్ల చట్టాన్ని ప్రవేశపెట్టి ముస్లింలను దగా చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. ముస్లింలకు జరిగిన అన్యాయంపై వైఎస్సార్‌సీపీ పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. బిల్లును వెనక్కు తీసుకునే వరకు పోరాటం ఆగదని, దేనికైనా సిద్ధమని ప్రకటించారు.



మాట్లాడుతున్న ఖలీల్ అహ్మద్, చిత్రంలో నాయకులు

- మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ సిద్ధిఖ్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం తెలపడంతో టీడీపీపై రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీపై మీద బురద చల్లాలని సోషల్ మీడియా ద్వారా టీడీపీ తప్పుడు ప్రచారం మొదలు పెట్టిందన్నారు. ఎల్లో పత్రికల్లో కథనాలు రాయించి ముస్లింలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.
- మైనార్టీ నాయకులు సత్తార్, సయ్యాద్ అలీం, అబ్దుల్ రజాక్, షేక్ సలీం మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నిత్యం గొప్పలు చెప్పుకొనే చంద్రబాబు ముస్లింలు ఏం కోరుకుంటున్నారో అర్థం చేసుకోలేకపోవడం ఘోరమన్నారు. ఆయన తన నిజస్వరూపాన్ని బయట పెట్టారని తెలిపారు. ఏకకంఠంతో ముస్లింలు వ్యతిరేకిస్తున్నా బిల్లుకు మద్దతు తెలిపి సవరణలు సూచించామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని చెప్పారు. సమావేశంలో కార్పొరేటర్ కరిముల్లా, నేతలు మున్వర్, షాకీర్, షేక్ మీరా, షేక్ హంషీద్ అలీ, రవూఫ్, జాకీర్, అబ్దుల్ రజాక్, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

12 నుంచి జిల్లా క్యారమ్ ర్యాంకింగ్ టోర్నమెంట్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్యారమ్ ర్యాంకింగ్ టోర్నమెంట్ – 2025 ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు నెల్లూరు క్లబ్‌లో జరుగుతుందని ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ శ్రీమన్నారాయణ, వీఆర్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునే వారు 10వ తేదీ సాయంత్రంలోపు సమాచారం అందించాలని కోరారు. వివరాలకు 94933 64955, 98854 65998 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- చెరువులో మునిగి బాలుడి మృతి

వెంకటాచలం: సరదాగా ఈతకెళ్లి చెరువులో మునిగి బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని కాకుటూరులో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కె.తన్మయ్ (13) చెముడుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం సెలవు కావడంతో ఇద్దరు స్నేహితులతో కలిసి కాకుటూరు సమీపంలోని కొత్త చెరువు వద్దకు ఈతకు వెళ్లాడు. చెరువులో గ్రావెల్ గుంతలు ఉండటంతో లోతు తెలియక తన్మయ్ నీట మునిగిపోయాడు. స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలించలేదు. వారి కేకలు విని స్థానికులు వచ్చి తన్మయ్‌ను బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు.

మాలకొండ ఆదాయం రూ.11.16 లక్షలు

వలేటివారిపాళెం: మండలంలోని మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం శనివారం ఒక్కరోజు ఆదాయం రూ.11.16 లక్షలు వచ్చినట్లు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కేవీ సాగర్‌బాబు తెలిపారు. అష్టోత్తరం ద్వారా రూ.5,950, కుంకుమార్చన ద్వారా రూ.17,440, తలనీలాల ద్వారా రూ.42,400, వాహన పూజల ద్వారా రూ.3,3320, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.3,37,300, రూము అద్దెల రూపంలో రూ.32,700, లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.1,90,030, విరాళాలు రూ.10,116, ఇంకా వివిధ రూపాల్లో మరికొంత ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.110
సన్నవి : రూ.80
పండ్లు : రూ.50

చేతికొచ్చిన పంట సర్వనాశనం


కోతకు సిద్ధంగా వరి పొలంలో జేసీబీ


ధ్వంసమైన పంట

- బీపీసీఎల్ సిబ్బంది, కాంట్రాక్టర్ల నిర్వాకం

కావలి: కావలి మండలంలోని సర్వాయపాళెం, అల్లిగుంటపాళెంలో 20 రోజుల్లో వరికోతకు సిద్ధంగా ఉన్న పంటను శనివారం బీపీసీఎల్ సిబ్బంది, కాంట్రాక్టర్లు జేసీబీలతో తొక్కించి నాశనం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో వారు దౌర్జన్యంగా తొక్కించేయడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. పంటను ధ్వంసం చేస్తున్న యంత్రాలను అడ్డుకుని నిరసన తెలిపారు. కృష్ణపట్నం నుంచి హైదరాబాద్‌కు బీపీసీఎల్ పైపులైన్ల పనులు చేపట్టింది. ఇందులో భాగంగా సర్వాయపాళెం, అల్లిగుంటపాళెం రైతులకు చెందిన భూముల్లో పైపులైన్లు వేయాల్సి ఉంది. పరిహారం చెల్లించకుండా ఆ సంస్థ సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తుండటం, రైతులకు కనీస మర్యాద ఇవ్వకపోవడంతో ఇటీవల ధర్నా కూడా నిర్వహించారు. పరిహారం చెల్లించకుండా భూముల్లో అడుగుపెడితే సహించేది లేదని స్పష్టం చేశారు. దీంతో బీపీసీఎల్ సిబ్బంది, కాంట్రాక్టర్లు శనివారం మధ్యాహ్నం సమయంలో అకస్మాత్తుగా జేసీబీలతో కోతకు సిద్ధంగా ఉన్న పొలాల్లో పనులు మొదలుపెట్టారు. చాలా మంది రైతుల పంట కళ్ల ముందే నాశనమైపోయింది. నాశనం చేసిన పంటకు కూడా పరిహారం చెల్లించాలని అన్నదాతలు డిమాండ్ చేశారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

నెల్లూరు సిటీ: ఇటీవల ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును తెంపుకెళ్లిన ఇద్దరు దొంగలను నెల్లూరు బాలాజీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. బాలాజీనగర్ 13వ వీధిలో అనురాధ అనే మహిళ నివాసం ఉంటోంది. గత నెల 31వ తేదీ రాత్రి ఆమె ఇంటి వద్ద నడుస్తోంది. ఈ సమయంలో ఆమె మెడలోని 48 గ్రాముల బంగారు సరుడిని ఇద్దరు గుర్తుతెలియని దుండగులు లాక్కెళ్లారు. బాధితురాలు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ సాంబశివరావు తన సిబ్బందితో కలిసి సాంకేతిక ఆధారాలు సేకరించారు. నిందితులను డైకస్ రోడ్డుకు చెందిన సింహాద్రి, విజయబాబుగా గుర్తించారు. శనివారం వారిని ఎన్టీఆర్ నగర్ వద్దనున్న పెట్రోల్ బంక్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. సరుడు, నేరానికి ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన అధికారులు, సిబ్బందిని నగర డీఎస్పీ సింధుప్రియ అభినందించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 113
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 202
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 226
లేయర్ చికెన్	: 178



ఏఎస్‌పేట దర్గాలో హైడ్రామా

- దర్గా ఈఓ, సజ్జదా మధ్య వివాదం
- పోలీసుల జోక్యం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండల కేంద్రంలోని హజరత్ ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో శుక్రవారం రాత్రి హైడ్రామా చోటుచేసుకుంది. దర్గా ఈఓ హుస్సేన్, దర్గా సజ్జదా హాఫీజ్ పాషాల మధ్య వివాదం నెలకొంది. ఈఓ కథనం మేరకు.. దర్గాలో హాఫీజ్ మతపరమైన కార్యకలాపాలు మాత్రమే చేసేలా 2023లో కోర్టు ఉత్తర్వులిచ్చింది. అయితే ఆయన కుమారుడు లేదా పీఏల చేత సలాంలు పాడిస్తున్నారు. దీనిని శుక్రవారం కూడా కొనసాగించారు. ఈ విషయమై ఈఓ అభ్యంతరం తెలిపారు. కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించి తన కుమారుడి చేత సలాంలు పాటిస్తుండటం సరికాదన్నారు. దీంతో హాఫీజ్ దర్గా ముందు బైఠాయించారు. పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై సైదులు దర్గా వద్దకు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. చివరకు హాఫీజ్ సలాంలు పాడారు.


ఈఓ, సజ్జదాల మధ్య వాగ్వాదం

రాజకీయ పార్టీలు పునరాలోచించాలి

- జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇలియాజ్

నెల్లూరు రూరల్: వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చిన రాజకీయ పార్టీలు పునరాలోచించి బీజేపీపై ఒత్తిడి తీసుకురావాలని భారత రాజ్యాంగ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇలియాజ్ అన్నారు. నెల్లూరులోని జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ దేశంలోని ముస్లింలను మోసం చేస్తోందన్నారు. బిల్లులో ఎన్నో లొసుగులు ఉన్నాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, దాని మిత్రపక్షాలు ముస్లింలను సాంస్కృతికంగా, ఆర్థికంగా దెబ్బకొట్టేందుకు గతంలో ఉన్న పటిష్టమైన వక్ఫ్ చట్టాన్ని నీరుగార్చారన్నారు. ముస్లింలు మాత్రమే సభ్యులుగా ఉండాల్సిన వక్ఫ్ బోర్డులో ఇతరులను మెజారిటీ సభ్యులుగా నియమించే విధంగా గత చట్టాన్ని సవరించడం రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు పూర్తిగా విరుద్ధమన్నారు. బిల్లుకు చంద్రబాబు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. సమావేశంలో సయ్యద్ నవీద్ అహ్మద్, సయ్యద్ షకీల్ అహ్మద్, షేక్ అబ్దుల్ కరీం, జాకీర్, అన్వర్ బేగ్, అబ్దుల్ గని, సర్దార్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఇలియాజ్

వృద్ధురాలి అదృశ్యం

నెల్లూరు సిటీ: మతి స్థిమితం లేని ఓ వృద్ధురాలు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరు టైలర్స్ కాలనీలో పురుషోత్తం అనే వ్యక్తి కుటుంబం నివాసం ఉంటోంది. అతడి తల్లి సుబ్బమ్మకు మూడు సంవత్సరాల నుంచి మతి స్థిమితం లేదు. ఈనెల 2వ తేదీన ఆమె ఇంటి నుంచి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 47.964 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 47.964 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న సిమెంట్ ట్యాంకర్


ఘటనా స్థలంలో బస్సు


గాయపడిన వారిని పరీక్షిస్తున్న దృశ్యం

- 12 మందికి గాయాలు
- తప్పిన పెను ప్రమాదం

సంగం: ఆర్టీసీ బస్సును సిమెంట్ ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో 12 మంది గాయపడ్డారు. ఆ సమయంలో ఆత్మకూరు వైపు నుంచి వాహనాలు సంగం వైపునకు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం మేరకు.. శనివారం నెల్లూరు నుంచి పామూరుకు 30 మంది ప్రయాణికులతో బస్సు బయలుదేరింది. ఇది సంగం బస్టాండ్‌కు వెళ్లింది. అక్కడి నుంచి పామూరుకు వెళ్లేందుకు బయలుదేరి నాలుగురోడ్ల సెంటర్ వద్ద బస్సు జాతీయ రహదారిని దాటుతోంది. ఈ సమయంలో సంగం నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న భారీ సిమెంట్ ట్యాంకర్ బస్సు మధ్య భాగంలో ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా ప్రయాణికులంతా కేకలు వేశారు. అదే సమయంలో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చి బస్సులో ఉన్న ప్రయాణికులను దించి సంగం వైద్యశాలకు 108 అంబులెన్స్‌లో తరలించారు. ఉసురుపాటి రాజమ్మ, జలదంకి వెంకటేష్, స్వర్ణ సువార్తమ్మ, వెలుపుల తిరుపతయ్య, ఒరిగినేని వెంకటేశ్వర్లు, షేక్ షమీర్, కృష్ణారెడ్డి, భూమిరెడ్డి అభినయ, యల్లసిరి రమణమ్మ, మహేష్, బుజ్జమ్మ, మరో యువకుడు గాయపడ్డారు. ఎస్సై రాజేష్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు, గ్రామస్తులు కలిసి రోడ్డుకు అడ్డుగా ఉన్న బస్సును పోలీసులు, పక్కకు నెట్టారు. ట్యాంకర్‌ను క్రేన్ సహాయంతో పక్కకు తొలగించి రాకపోకల్ని పునరుద్ధరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంగం వైద్యశాలలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స అవసరమైన వారిని నెల్లూరు, ఆత్మకూరు వైద్యశాలలకు తరలించారు.

నిత్యం ప్రమాదాలు

సంగం నాలుగు రోడ్ల సెంటర్‌లో 10 రోజుల్లో మూడుసార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో గ్రామస్తులు, బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఎన్ని హెచ్చరికలు చేసినా వాహనదారులు మితిమీరిన వేగంతో వస్తుండటమే ప్రమాదాలకు కారణం. పోలీసులు హిల్ రోడ్డు దిగే ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం షాపులో తాగుబోతుల వీరంగం


గాయపడిన వ్యక్తి


విచారిస్తున్న ఎస్సై హనీఫ్

- ముగ్గురిపై దాడి
- యువకుడికి తీవ్రగాయాలు

పొదలకూరు: పట్టణంలోని వెంకటేశ్వర మద్యం షాపులో శనివారం నలుగురు తాగుబోతులు వీరంగం సృష్టించారు. కుర్చీలను విరగ్గొట్టడంతోపాటు మద్యం తాగుతున్న వారిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడి గాయపరిచారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని మహ్మదాపురం ఎస్సీ కాలనీకి చెందిన విజయ్‌కుమార్, బత్తులపల్లి గ్రామానికి చెందిన వాసు, అఖిల్, వెంకట్ నెల్లూరులో పనిచేస్తుంటారు. వీరు మద్యం తాగేందుకు వచ్చి ఇష్టానుసారంగా ప్రవర్తించారు. ముందుగా ఉప్పుటూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై దాడి చేయడంతో అతను కిందపడిపోయాడు. పట్టణానికి చెందిన చాంద్‌పై దాడి చేయగా అతడు భయపడి వెళ్లిపోయాడు. తర్వాత అదే షాపులో మద్యం తాగేందుకు వెళ్లిన పట్టణానికి చెందిన మెకానిక్ భక్తనార్‌పై విచక్షణారహితంగా బీరు బాటిల్, ఇటుకరాయితో దాడికి పాల్పడ్డారు. అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఎస్సై హనీఫ్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు పంపారు. భక్తనార్‌కు తలపై ఆరు కుట్లు పడినట్టు స్థానికులు వెల్లడించారు. నిందితుల్లో ఒకరిద్దరు బౌన్సర్లుగా పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. వారి వల్ల చుట్టుపక్కల వారు భయాందోళనకు గురయ్యారు. నిందితులను ఎస్సై అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

EDUCATION

DIRECT FINAL YEAR
■10th,Inter,B.Sc, BCA, BBA, B.Com BA,MCA,MBA,M.Sc,M.Com,MA,B.Tech, M.Tech, Paramedical, BLISC, MLISC, B.Voc,M.Voc @ 80080 10144. [NA-5504]

REAL ESTATE

■సాక్షి పేపర్ ఎదురుగా వెంకటేశ్వర రెడ్డి లేఅవుట్ చుట్టు పక్కల ప్లాట్లు, సాక్షి పేపర్ దగ్గర కమర్షియల్ ప్లాట్లు కొనదలచిన / అమ్మదలచిన వారు సంప్రదించండి: 93471 13459. [NA-11276]

■స్పాట్ క్యాష్‌తో కనుపర్తిపాడు, పడారుపల్లి, కొండాయపాలెం, కల్లూరుపల్లి, బి.బి.నెల్లూరు, కాకటూరు, బి.వి.నగర్ ఏరియాలలో అన్ని లేఅవుట్ల నందు ప్లాట్‌లు కొనబడును. 9849489529. [NA-11265]

FLAT FOR SALE
■Newly Constructed 2 BHK Flats for Sale in iskoncity Nellore, Ready to Occupy. Loan facility. Owner : 8142961601 [HA-474]

■నెల్లూరు, బి.వి.నగర్, సంఘమిత్ర స్కూలు ఎదురుగా, NUDA మరియు RERA నిబంధనలతో నిర్మింపబడిన Sanghamitra Homes Apartment నందు 2BHK Flats అమ్మబడును. Ready to Occupy. సెల్ : 99593 90066, 92472 56585. [NA-24094]

■నెల్లూరు, బి.వి.నగర్‌లో ఆధునిక వసతులతో, NMC & RERA నిబంధనలతో నిర్మింపబడిన "DRK Jewel Rocks" అపార్టుమెంట్ నందు 3BHK / 2BHK Flats అమ్మబడును. Ready to Occupy. సెల్ : 90300 44271, 98660 17066. [NA-24095]

PLOT FOR SALE
■70 Ankanas 586 Sq.yds. Survey No. 424 & 425 Nellore Bank Colony. Only Serious Buyer's Call (M) Venkat : 9966924726 [HA-2134]

■నరుకూరు సెంటర్ సమీపంలో SBI దగ్గరలో DTCP & NUDA Approved ప్లాటు అంకణం 65 నుండి 80వేలు. సంప్రదించండి సెల్ : 6281411178, 9121452347. [NA-11278]

■మూలాపేట ఇరుగాళమ్మగుడి నుండి 5కి.మీ దగ్గరలో నెల్లూరు కార్పొరేషన్లో బ్యాంకు లోను తో నుడా అప్రూవల్ ప్లాట్స్ అం॥ 65వేల నుండి& ఇళ్ళు 45లక్షల నుండి అమ్మబడును. 90000 75785. [NA-11275]

■నెల్లూరు రూరల్ గొలగమూడి ఆర్చ్ మహావీర్ రియల్ ఎస్టేట్ లేఅవుట్ తూర్పు ఫేసింగ్ ప్లాట్ నెం. 977 అమ్మబడును. సంప్ర : 80996 66212. [N-1273054]

■వెంకటేశ్వరపురం పాలిటెక్నిక్ Opp Nuda Fully Dev సైట్లో 40 Ft. రోడ్డు ఇల్లు కట్టుకోవడానికి 25 అంక : East Plot Sale అంక : ధర రూ. 1,50,000/-. ఫోన్ : 97004 77222. [V- 6700]

FOR SALE
■For Sale / Buy Plots, Flats, Houses, Shopping Property Sales / Buy. Consulting All Areas. Contact: SMS. 7382527139, 7780333080. [NA-5499]

LEASE
■Now Lease Prime Space in From Easy Accessibility Convience in Nellore. 1000 Sq.Feet 1st Floor. Opp.Babu Ice Cream. Best For Consulting,Training,Service Centres, Electronic, Apparel, Super Market and Pharmacy Store's.Call :9849263031. [NA-11277]

■రన్నింగ్‌లో ఉన్న సూపర్ మార్కెట్ (2000Sft) లీజుకు ఇవ్వబడును. పార్కింగ్ సదుపాయం .నారాయణ హాస్పిటల్ దగ్గర ముత్తుకూరు రోడ్ సంప్ర: 93475 56677, 99080 98799. [NA-24080]

LEASE / SALE
■నెల్లూరు, పొగతోట నందు అన్ని వసతులు గల 120 అంకణములు, బిల్డింగ్ అమ్మకమునకు/లీజుకు కలదు. ఆసక్తి కలవారు సంప్రదించండి: 97011 13335, 70934 85547. [NA-6863]

RE-WANTED
■నేషనల్ హైవే పొలాలు కావలెను. నాయుడుపేట నుంచి చెన్నై దాకా, నెల్లూరు నుంచి ఒంగోలు దాకా నేషనల్ హైవే ఫేసింగ్ పొలాలు (Lands) అమ్మదలచిన వారు సంప్ర : 93471 13459. [NA-11263]

TO-LET
■నెల్లూరు రామ్మూర్తినగర్, 1st స్ట్రీట్‌లో 3750 Sft గల (గ్రౌండ్ ఫ్లోర్, 3BHK, 3పెద్ద హాల్స్, విశాలమైన 5, 6కార్ల పార్కింగ్ వసతి గల) ఇండిపెండెంట్ హౌస్ కమర్షియల్‌గా బాడుగకు కలదు.సంప్ర: 93936 33377, 87909 08080. [NA-954]

SERVICES

■బుజ్జీస్ బ్యూటీపార్లర్, Opp. సండేమార్కెట్ పొగతోట, నూతన విధానాలతో స్పెషల్ ట్రీట్‌మెంట్ కలదు. బ్రైడల్ మేకప్, హెయిర్ స్టైల్ మా ప్రత్యేకత. సంప్రదించండి: 2347011. [NA-5498]

GOLD FINANCE
■బ్యాంకులలో వివిధ తాకట్టు సంస్థలలో ఉన్నవి బంగారు వేలం సమయానికి విడిపించి మార్కెట్ ధర ప్రకారం స్పాట్ క్యాష్ ఇవ్వబడును. సెల్ : 98851 82772, 62813 46878 [V- 6701]

TOURS & TRAVELS
■రైలుయాత్ర (ఎ/సి 3టైర్) మే నెలలోవారణాశి, అయోధ్య, నైమిశారణ్య, రుషికేష్, హరిద్వార్, ప్రయాగ, గయా మొదలగు పుణ్య క్షేత్రాల దర్శనం బుకింగ్ ప్రారంభం, నెల్లూరు. 70327 36622. [NA-814]

■విహార యాత్రలు.కేరళ 11.4.25తేదీ 3రోజులు. టికెట్: 5999/-. ఒరిస్సా 25.4.25తేది 5 రోజులు.టికెట్.9999/-.(ACబస్సు,భోజనం, రూం).కె.వాసు,నెల్లూరు.సంప్ర:9491340504. [NA-24055]

WANTED

■Wanted Female Telecallers For Banking Process @ RTC, Nellore-Fixed Salary : 10000 to 12500. No Targets. Contact: 98489 54646. [NA-1268025]

■Mi Broadband Wanted Cable, Fiber Technicians, ITI, Electricians, Comp Hardware, Helpers, Sal@12000 - 17000. Contact: 8686611666, 9299999493. [NA-24105]

■Wanted Delivery Boys for ECOM Companies Like Flipkart, Meesho at Nellore. Contact : Sreeman Tech, Nellore. Cell : 78420 15550. [NA-6874]

■కావలెను. కేర్ టేకర్స్ నర్సులు, విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే వుండి చూసుకొనుటకు అత్యధిక జీతం+ వ+భో. ఆంధ్ర హోమ్‌కేర్స్ VJA ✆ 91608 35559, 93473 80332 [B-001]

■మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25002594]

■మా ఇంటి వద్ద వయలిన్ (VIOLIN) నేర్పించుటకు MUSIC టీచర్ కావలెను ఫోన్ : 94404 39605 [SCA25002609]

■IT & NON-ITలో ఉద్యోగాలు కలవు. (Pan India) టెలికాలర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్రదించండి: 9676971119, 9676841116. [NA-3042]

■ప్రముఖ దయాగ్నోస్టిక్, పొగతోట, నెల్లూరు నందు Blood Sample Collect చేయుటకు అబ్బాయి,ద్విచక్ర వాహనం కలిగి ఉండవలెను. సంప్ర: 90323 56555, 92466 60007. [NA-3044]

■బెంగుళూరులో క్యాబ్ డ్రైవర్లు కావలెను. నెలకు 35000/- నుండి 40,000/- వరకు. వీక్లీ పేమెంట్. రూము మరియు ఫుడ్ మాదే. వివరములకు సంప్రదించండి: 7349025662. [N-1260165]

■నూతనంగా స్థాపించబడిన వాటర్ బాటిల్ ఫ్యాక్టరీ నందు పని చేయుటకు యువతీ యువకులు కావలెను. మంచి జీతం కలదు. వివరములకు సంప్రదించండి: 79819 80975. [N-1268026]

■రెడిమేడ్స్ షాపు నందు పని చేయుటకు బాయ్స్ హెల్పర్స్, అనుభవం ఉన్న సేల్స్‌గర్ల్స్, సేల్స్ మెన్స్, మార్కెటింగ్ చేయుటకు జెంట్స్ కావలెను. 93986 44232, 93926 95940. [NA-24091]

■బజాజ్ ఫైనాన్స్ నందు పని చేయుటకు రికవరీ మేనేజర్లు & ఏజెన్సీ పార్టనర్స్ కావలెను. Qlf: 10th Pass మరియు ఇంటర్. వివరములకు సంప్రదించండి: 96769 76869. [NA-24096]

■నెల్లూరులోని ప్రముఖ కంపెనీలో పని చేయుటకు Tally,MS Office నందు అనుభవం కల లేడీ అకౌంటెంట్ కావలెను. వివరములకు సంప్రదించండి: 95025 28555. [NA-6872]

■Andromeda కంపెనీ నందు పని చేయుటకు Sales, Tele, Survey కు సిబ్బంది కావలెను. జీతం: 12,000 నుండి 25,000.వివరములకు సంప్రదించండి: 9182826279. [NA-6873]

■ఆంధ్రకుటుంబమిషన్స్‌లో పనిచేయుటకు Male / Female Wanted. జీ॥ 8000 to 12000. ఆంధ్రకుటుంబమిషన్స్. Opp: RS Brothers. Trunk Road, NLR. Cont: 99494 03526. [NA-1268024]

■ప్రముఖ బ్యాంకు అనుబంధ సంస్థ వారికి నెల్లూరు జిల్లాలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. వెంటనే సంప్రదించండి ✆ 96426 87468 [B-17]

■తిరుపతికి అతి దగ్గర పాఠశాలలోని ప్రముఖ కార్పొరేట్ స్కూల్‌కి టీచర్స్ (All Subjects), PRO లు కావలెను. దూర ప్రాంతాల వారికి ఫుడ్ & రూం సౌకర్యం. 8008337562, 9966628872. [T-789134]

■SBI నందు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయుటకు బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ కావలెను. (Bank లోపల కూర్చొని చేసే ఉద్యోగం) Any Degree, M/F, A:32yrs, 9121905906, 9949942245. [T-2390]

■త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఉచిత వసతి భోజనం. జీతం:18K.Ph:8520980099, 8520874499 [HA-1906]

■కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ:15-40వేలు.ఫ్రీరూం+ భోజనం.HYD. 8317512135 [HA-00277]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.